క్లుప్తంగా

మేడిగడ్డ బ్యారేజ్‌కు మరమ్మతులు చేపట్టాలి



మహబూబాబాద్: మేడిగడ్డ బ్యారేజ్‌కు మరమ్మతులు చేసి రైతాంగానికి సాగు నీటి కష్టాలు రాకుండా చూడాలని రైతులు మల్లయ్య, మంగిలాల్, ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీముడు, శ్రీను, చందులాల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన పుష్పలత



కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన కొత్తకొండ ప్రసాద్ భార్య పుష్పలత తెలంగాణ గురుకుల నియామకాల్లో నాలుగు ఉద్యోగాలు సాధించింది. ఇటీవల విడుదలైన గురుకులాల పరీక్ష ఫలితాల్లో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికై నట్లు ఆమె భర్త తెలిపాడు. ప్రస్తుతం ఆమె వరంగల్ తూర్పులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

గూడూరు: ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థుల అభ్యున్నతికి సహకరించాలని గ్రామానికి చెందిన విద్యా దాత కోరె వెంకన్న అన్నారు. మండలంలోని పొనుగోడు జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం పాఠశాలను దత్తత తీసుకున్న వ్యక్తిగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు హెచ్ఎంగా వచ్చిన పూల్‌సింగ్ అభివృద్ధి పనులపై, జరిగే ఖర్చులపై తప్పుడు సమాచారం అందించి విద్యా వ్యవస్థను కుంటు పరిచే పని చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు లేకుండా పాఠశాల కొనసాగడంతో కొంత ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. తిరిగి పాఠశాల పూర్వవైభవాన్ని తీసుకొస్తానన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నెహ్రూసెంటర్: భవన నిర్మాణ కార్మికరంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శంకర్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా లేబర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ భరత్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. 60ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్, కేంద్ర కార్మిక సంఘాల నాయకులను కార్మిక బోర్డులో సభ్యులుగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, శేఖర్, సురేష్, మహమూద్, భీం, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



తొర్రూరు: పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీని శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బానోతు శ్రీను, ప్రధాన కార్యదర్శిగా తాండాల ఆంజనేయులు, కోశాధికారిగా పిట్టల శేఖర్, అసోసియేట్ అధ్యక్షుడిగా జె. శ్రావణి, నగేష్, ఉపాధ్యక్షుడిగా కె. ప్రభు, సంయుక్త కార్యదర్శులుగా అశోక్, సుమన్, మీడియా కోఆర్డినేటర్లుగా గుగులోతు రాజు, కార్తీక్ గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా చిత్రాంజలి, నీరజ, శోభ, ఉపేందర్, ముక్తీశ్వర్, షరీఫ్, ఉష, మాధవి, అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

అప్పుల బాధ తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడ: అప్పుల బాధ తట్టుకోలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీనగర్‌కు చెందిన జంపయ్యకు ఇటీవలే వివాహం జరిగింది. ఉమ్మడి ఆస్తి పంపకాల్లో భాగంగా జంపయ్యకు రూ.10లక్షల అప్పు పడింది. అవి చెల్లించలేక పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చాడు. పరువు పోతుందని ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మరిపెడ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే తండాల అభివృద్ధి అని పార్టీ నాయకుడు మాలోతు బిక్కునాయక్ అన్నారు. మండలంలోని భూక్య తండా గ్రామ పంచాయతీ పరిధి మాలోతు తండాలో రూ.10లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాయకులతో కలిసి బిక్కునాయక్ శుక్రవారం ప్రారంభించాడు. నాయకులు మంగిలాల్, రామన్న, కల్యాణ్‌నాయక్, కిషన్‌నాయక్, కృష్ణ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఎస్సారెస్పీ కాల్వలు

- పేరుకుపోయిన పిచ్చి మొక్కలు
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- ఆక్రమణకు గురవుతున్న కాల్వ స్థలం

డోర్నకల్: కురవి, డోర్నకల్ మండలాల పరిధిలోని ఎస్సారెస్పీ డీబీఎం 48 కాల్వల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కాల్వల్లో పిచ్చి మొక్కలు, పూడికతో మూసుకుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో కాల్వ సిమెంట్ లైనింగ్ ధ్వంసం కావడంతో అందులో పెద్దపెద్ద చెట్లు పెరిగాయి. చాలా ప్రాంతాల్లో కాల్వలకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని రైతులు ఆక్రమించారు.

30కిలోమీటర్లకు పైగా డీబీఎం కాల్వ..

కురవి, డోర్నకల్ మండలాల పరిధిలో డీబీఎం 48 కాల్వ 30కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సంగెం మండలం తీగరాజుపల్లి వద్ద ప్రారంభమయ్యే ఈ కాల్వ ఖమ్మం రూరల్ మండలం మున్నేరు వాగు వరకు 83 కిలోమీటర్లు విస్తరించి ఉండగా, 48 కిలోమీటర్లు కురవి మండలంలో ప్రారంభమై ఖమ్మం రూరల్ మండలం మున్నేరువాగులో కలుస్తుంది. ఎస్సారెస్పీ కాల్వ కింద కురవి మండలంలో 28వేల ఎకరాలు, డోర్నకల్ మండలంలో 18వేల ఎకరాల భూములు సాగవుతున్నాయి. ఎనిమిది నెలలపాటు కాల్వల ద్వారా నీరు పంటలకు అందాల్సి ఉండగా 15రోజులకోసారి మూడు నుంచి నాలుగురోజులపాటు కాల్వలకు నీటిని విడుదల చేయాల్సి ఉంది.

గండ్లు పడుతున్నాయి..

కాల్వలు ధ్వంసం కావడం, చెట్లు పెరగడం, ఆక్రమణకు గురికావడం వంటి తదితర కారణాలతో కాల్వ నీరు చివరి ఆయకట్టుకు చేరడం లేదు. డీబీఎం 48 ప్రధాన కాల్వ నుంచి గ్రామాల్లోకి నిర్మించిన ఉప కాల్వల్లో కొన్ని కాల్వలు ధ్వంసం కాగా కొన్ని ఆక్రమణకు గురయ్యాయి. కాల్వలు పూడుకుపోవడంతో బొడ్రాయితండా సమీపంలో తరచూ గండ్లు పడుతున్నాయి. ఐదేళ్లుగా కాల్వలకు మరమ్మతులు చేయడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి, ఆక్రమణలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



వెన్నారం, బూరుగుపాడు మార్గంలో కాల్వల్లో పెరిగిన పిచ్చి మొక్కలు



కాల్వ పక్కన ఆక్రమణకు గురైన స్థలం



బొడ్రాయితండా సమీపంలో కాల్వకు గండి(ఫైల్)

పోలియో రహిత సమాజం స్థాపిద్దాం..

గార్ల: పోలియో రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ నోడల్ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ సూచించారు. శుక్రవారం గార్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో పల్స్‌పోలియోపై అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 3వ తేదీన నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ ఉన్న ప్రాంతాలు రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, రహదారి కూడళ్లలో, ఇటుక బట్టీల ప్రాంతాల్లో 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సదస్సులో ఎంపీపీ భట్టు నాగరాజు, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, వైస్ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ రజిని, డీటీ సుధాకర్, ఏఈ కిషోర్, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: ఈనెల 3వ తేదీన పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజం కోసం పాటుపడాలని మండల వైద్యాధికారి చైతన్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలాజీ, క్షయ నోడల్ అధికారి చలపతి రావు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలో ఆదివారం జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ కోరారు. శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలో ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రవికుమార్, వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గార్ల: మాట్లాడుతున్న అధికారి రాజ్‌కుమార్ జాదవ్



చిన్నగూడూరు: మానవహారంలో వైద్యసిబ్బంది, విద్యార్థులు

వ్యాపారులు నష్టపోకుండా చూడాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వ్యాపారులు నష్టపోకుండా చూడాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మాణం చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ నోముల రవీందర్, అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యాపారుల ఎంపిక విషయంలో అన్ని కోణాలలో ఆలోచించి ఎంపిక చేయాలన్నారు. వ్యాపారులు నష్టపోకుండా చూడాలని, ఆ దిశగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్దన్, అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, నాయకులు ఘనపురపు అంజయ్య, పోతురాజు రాజు, తదితరులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

గార్ల: దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీలో జరిగిన దివ్యాంగుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు పింఛన్, ఉద్యోగ అవకాశాలు పెంచాలన్నాడు. చార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను అందజేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ సదస్సులో సంఘం నాయకులు నేతగాని ధర్మయ్య, మాన్‌సింగ్, కస్నా, కుమార్, మోహన్, ఈరు, భద్రు, శంకర్ పాల్గొన్నారు.

వరి పొట్టదశలో జాగ్రత్తలు తీసుకోవాలి

దంతాలపల్లి: వరి పొట్ట దశలో ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో శుక్రవారం ఆయన వరిపంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. వరి పొలాలకు ఆశిస్తున్న మొగి, కాండం తొలిచే పురుగులతోపాటు జింకు లోపం వలన వరి పంటకు పొట్ట దశలో ఎర్రతెగులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తెగులు సోకకుండా పంటను తరచు ఆరబెడుతూ ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతులు యాకన్న, లచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, యాకన్న, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న లింగయ్య



తొర్రూరు రూరల్: వెలికట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని రిటైర్డ్ ఎంఈఓ నల్లా లింగయ్య శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మాలోతు కోట్యానాయక్, ఉపాధ్యాయులు సోమయ్య, తిరుమలయ్య, ఉమాదేవి, రమ, సునీత, శకుంతల పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రూ.6వేల విలువ చేసే పరీక్ష ప్యాడ్లతోపాటు ఇతర సామగ్రిని శ్రీసాయిరాం కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు.

కురవి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బి.వీరమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు బీవీ.ప్రసాద్ పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎండి .వహీద్, ఉపాధ్యాయులు వెంకన్న, మల్లికార్జునరావు, చారి, విజయరాజ్, పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాన శిబిరం సందర్శించిన ఝాన్సీరెడ్డి

తొర్రూరు: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40యూనిట్ల రక్తం సేకరించగా.. రక్తదాతలకు ఝాన్సీరెడ్డి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్‌కుమార్, ప్రతినిధులు పయ్యావుల ప్రవీణ్, పూర్ణాచారి, రమాకాంత్, చందురెడ్డి, రాజు, ప్రవీణ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తామామపై దాడి

గార్ల: అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇవ్వడం లేదనే అక్కసుతో అత్తామామపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన శుక్రవారం ముల్కనూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన శ్రీను తన అల్లుడు చంద్రశేఖర్ వద్ద ఏడాది క్రితం అప్పుగా రూ.1,35,000 తీసుకున్నాడు. అప్పు డబ్బులు చెల్లించాలని అల్లుడు మామ ఇంటికి వెళ్లాడు. ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో అల్లుడు కర్రతో మామ, అడ్డు వచ్చిన అత్తపై దాడి చేశాడు. గాయపడిన మామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ అల్లుడు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

మహబూబాబాద్: పూర్తి కాని డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తి చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో గల పూర్తి కాని డబుల్ బెడ్రూం ఇళ్ల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 350 గృహాల నిర్మాణం చేపట్టి కేవలం 200 ఇళ్లు మాత్రమే పూర్తి చేసి లబ్దిదారులకు కేటాయించిందన్నారు. 150 గృహాలు పూర్తి కాలేదని వాటిని పూర్తి చేసి పేదలకు కేటాయించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇళ్లను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట రాజమౌళి, సీతారాం, రావుల రాజు, శ్రీను, వెంకన్న, రమేష్, రమాదేవి, ప్రకాష్, మోతీలాల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య

సంక్షిప్త సమాచారం

ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవేందర్‌రెడ్డి



తొర్రూరు: గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. హైదరాబాద్‌లో జరిగిన ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధు నియామక పత్రం అందించారు.

పీఈటీ పోస్టులను పెంచాలి

చిన్నగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో వ్యాయామ విద్యకు సంబంధించిన పీఈటీ పోస్టులను పెంచాలని నిరుద్యోగులు బాలమల్లు, అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. డీఎస్సీలో పీఈటీ పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా 1600 ఖాళీలుండగా కేవలం 182 పోస్టులను మాత్రమే భర్తీ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

మిత్రుల ఆర్థికసాయం



గార్ల: గార్లలోని మసీద్ సెంటర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు జీవనం కొనసాగిస్తున్న జి.శ్రీనివాసాచారి(49) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి 1988–89 పదో తరగతి బ్యాచ్ బాల్యమిత్రులు బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.18వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు ప్రసాద్, కుమార్, వెంకటరమణ, అప్పిరెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం..

పెద్దవంగర: ధరణి కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ మహేందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 9వ తేదీ వరకు మండలంలోని ఉన్న భూ సమస్యల ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి భూసమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మహబూబాబాద్అర్బన్: జిల్లాలో ప్రతి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రానికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ వద్ద పరీక్ష హాల్ టికెట్లతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైపాల్, రాంబాబు, మహేందర్, భరత్, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలి

మహబూబాబాద్ అర్బన్: మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణను సాధించేందుకు మాదిగలు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగిళ్ల పీరయ్య డిమాండ్ చేశాడు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో మాదిగ అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరుల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోలేపాక ప్రవీణ్, మహిళ అధ్యక్షురాలు రజియా, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

డోర్నకల్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ కె.కృష్ణవేణి పరిశీలించారు.

పురస్కారాలు అందజేత

తొర్రూరు: హనుమకొండలో ఇటీవల జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పురస్కారాల ప్రదానోత్సవంలో 2022–23లో రీజియన్ చైర్మన్‌గా ఉత్తమంగా పని చేసిన రేగూరి వెంకన్నకు ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. వారితోపాటు జోన్ చైర్మన్ ప్రతాపని వెంకటేశ్వర్లుకు ప్రెసిడెన్షియల్ అవార్డు, రీజియన్ సెక్రెటరీ దామెర సరేష్‌కు మల్టిపుల్ అవార్డు, సేవా తరుణి అధ్యక్షురాలు వజినపల్లి దీప, టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు రాయిపల్లి యాకయ్యలకు పురస్కారాలు దక్కాయి.

సన్మానం

గార్ల: గార్ల ఎంపీపీగా ఎంపికైన భట్టు నాగరాజును శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీడీఓ మంగమ్మ శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జార్ఖండ్ సదస్సుకు ఎంపీపీకి ఆహ్వానం



గంగారం: జార్ఖండ్ రాష్ట్రంలో రాంచీలో మార్చి 4,5 తేదీల్లో జరిగే రెండురోజుల పీసా సమావేశానికి ఎంపీపీ సువర్ణపాక సరోజనకు ఆహ్వానం వచ్చింది. శుక్రవారం పీఆర్అండ్ ఆర్‌ఈ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు పంపించారు.

వాహన డ్రైవర్ల మధ్య ఘర్షణ

మహబూబాబాద్ రూరల్: కారును బొలేరో వాహనం ఓవర్ టేక్ చేసి వెళ్లగా.. ఆ వాహనాల డ్రైవర్లు ఘర్షణపడి ఆ పంచాయతీ పోలీసుస్టేషన్‌కు చేరుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీలు పనులు ముగించుకుని బొలేరో వాహనంలో శనిగపురం గ్రామం వైపునకు వెళ్తున్నారు. ఈక్రమంలో ఆ వాహనం వెనకాలే కారు ఓవర్‌టేక్ చేసి పట్టణంలోని రాధాకృష్ణ సెంటర్ వద్ద ఆగింది. వెనకాలే వచ్చిన బొలేరో వాహనం డ్రైవర్ ఓవర్‌టేక్ ఎందుకు చేశావని కార్ డ్రైవర్‌తో గొడవకు దిగాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గొడవ కాస్త ఉద్రిక్తతకు దారితీసి.. ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

పీజీలో గోల్డ్ మెడల్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామానికి చెందిన భూక్య లాలు, మోతీ దంపతుల కుమారుడు భూక్య రాకేష్ ఎంఏ పీజీ లో కర్ణాటక రాష్ట్రంలోని కేంద్రీయ విశ్వ విద్యాలయం నుంచి గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

దంతాలపల్లి: ఈనెల 10వ తేదీన జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే విగ్రహ ఆవిష్కరణ, మహిళా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుమాధవ రెడ్డి, సంఘం మండల అధ్యక్షుడు తాళ్లూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యాకయ్య, కుమారస్వామి, రమేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

బయ్యారం: ఈనెల 10న జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళా సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కొమిరె ఉప్పలయ్య ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ప్రవీణ్, మీరా, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనాథలైన అన్నదమ్ములు

- దాతల సాయం కోసం ఎదురుచూపు




గూడూరు: చిన్నప్పుడే కన్నతల్లి వదిలి వెళ్లగా, తండ్రి ఆలనాపాలనలో పెరిగిన ఇద్దరు చిన్నారులు, తండ్రి మరణంతో అనాథలైన సంఘటన మండలంలోని గాజులగట్టు శివారు పాటిమీదిగూడెంలో చోటుచేసుకుంది. వివరాలు.. పాటిమీదిగూడెంలో ఆదివాసీ కుటుంబానికి చెందిన నిరుపేద పెనుక శ్రీనివాస్ తల్లిదండ్రులు మరణించడంతో ఒంటరి వాడయ్యాడు. దీంతో గ్రామస్తులు, బంధువులు కలిసి శ్రీనివాస్‌కు పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు పెనుక శ్రావణ్‌కుమార్, పెనుక శశికుమార్. శ్రీనివాస్‌తో భార్య గొడవపడి ఇద్దరు కుమారులను వదిలి వెళ్లింది. తండ్రి కూలీ పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్నాడు. ఈ క్రమంలో గత సంవత్సరం శ్రీనివాస్ అనారోగ్యానికి గురై మరణించాడు. గ్రామస్తులే దహన సంస్కారాలు నిర్వహించారు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలై ఒంటరిగా నిలబడ్డారు. మానవతా దృక్పథంతో చిన్నారుల విద్యాభివృద్ధికి, ఎదుగుదలకు, వారి భవిష్యత్‌కు సహకరించాలని, ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సెల్ నంబర్ 96188 02629ను సంప్రదించాలని, దాతలుగా ఇదే నంబర్‌కు గుగూల్ లేదా ఫోన్‌పే చేయాలని చిన్నారులు వేడుకుంటున్నారు.




అనాథలైన చిన్నారులు

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



నెహ్రూసెంటర్: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14వ తేదీన ఢిల్లీలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ.. రైతాంగ ఉద్యమాన్ని అణిచి వేసేందుకు మోదీ ప్రభుత్వం రైతులపై పాశవికంగా దాడులు చేస్తుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు వెంకటనారాయణ , నందగిరి వెంకటేశ్వర్లు, జి.సక్రు, ఎస్‌కె బాబు, ఆలకుంట్ల సాయిలు, చింత వెంకన్న, ఉడుగుల లింగన్న, చిర్ర యాకన్న, తోకల వెంకన్న పాల్గొన్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి



సాత్విక మృతదేహం

కేసముద్రం: పాముకాటుతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని వెంక్యాతండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..తండాకు చెందిన కున్సోత్ సుధాకర్, స్వరూప దంపతులకు కుమారుడు, కుమార్తె సాత్విక(3) ఉన్నారు. కాగా, సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సాత్విక స్నానాలగది వద్దకు వెళ్లింది. గదిపైకప్పు నుంచి కిందపడిన పాము.. అక్కడే ఉన్న చిన్నారి కాలుపై కాటువేసింది. దీనిని గమనించిన తల్లి కేకలు వేయడంతో కుటుంబీకులు చేరుకున్నారు. చిన్నారిని హుటాహుటిన మానుకోట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.